

# మనియార్డర్ వచ్చింది

"స్టేషన్‌కు ఎవరూ రాలేదేం?"

ఇంట్లోకి అడుగుపెడుతూనే అడిగాడు గోవర్ధన్.

ఈశ్వరయ్య విస్తుపోయాడు.

"నువ్వేమన్నా చిన్నాడివా లేక ఈ వూరికి కొత్తా? స్టేషన్‌కు మేం రావడమేమిటిరా?" కొంచెం వొళ్ళొచ్చి రంగు తేలిన కొడుకుకేసి ఆనందంతో నిండిన కళ్ళతో అంది భాగ్యలక్ష్మమ్మ.

"నే వొస్తున్నానని తెలిసి ఊళ్ళో సగంమందికి పైగా ఫ్రెండ్స్, పెద్దవాళ్ళు, మునిసిపల్ ఛైర్మన్‌తో సహా స్టేషన్‌కొచ్చి రిసీవ్ చేసుకున్నారు. మీరు రాకపోవడం వెలితిగానే వుంది."

కొడుకులో ఏదో మార్పు కొట్టొచ్చినట్టు కన్పించింది ఈశ్వరయ్యకు.

....అవును....వాడిప్పుడేమీ చిన్నా, చితకా? గ్రూప్ వన్ పరీక్షలు ప్యాసయి ఆర్.డి.వో అయ్యాడు. వాడు వుండటానికి పెద్ద బంగళా, జీపు, చేతికింద నౌకర్లు....తనదగ్గర ఎ,బి,సి,డీలు నేర్చుకున్న కొడుకు కాదు .... పోనీలే. కొడుకు పెద్ద ఆఫీసరవ్వడం తనకు మాత్రం సంతోషం, గర్వం కాదూ....

"ఎలా వుందిరా ఉద్యోగం?"

"బాగానే వుంది. కిందటినెలలో రిటైరైనానని ఉత్తరంలో వ్రాశారు. మీకు ఇక్కడ ఎలా తోస్తున్నది? మీరు, అమ్మ, చెల్లెలు నా దగ్గర కొచ్చెయ్యకూడదూ!"

ఈశ్వరయ్య నవ్వి వూరుకున్నాడు కొడుకు మాటలు విని.

"నాకేం తెచ్చావన్నయ్యా?" గోవర్ధన్ని అడిగింది పరిమళ నవ్వుతూ.

"యమ్.ఎ చదువుతున్నావ్! ఇంకా నీకు ఏం తీసుకురావాలి? నువ్వేమన్నా చిన్నపిల్లవా! కావాలంటే డబ్బులిస్తాను. నీ క్కావల్సింది కొనుక్కో!"

మొహం ముడుచుకుంది పరిమళ.

"డబ్బులు కావాలంటే నాన్న యివ్వలేడా? నిన్నడగటం దేనికి? అంతదూరం నుండి వొచ్చావు.... నాకేదన్నా ప్రజెంటేషన్ తెచ్చావేమోనని సరదాగా అడిగానన్నయ్యా!"

అలవర్తి రామకృష్ణ

"వీకు పెళ్ళిచేసి చాలాదూరం పంపించాలి! అక్కడనుంచి అమ్మా, నాన్నకు ఏం ప్రజెంటేషన్ పంపుతాడో నేను చూస్తాగా!" అన్నాడు గోవర్ధన్.

ఏదో మాట్లాడబోయింది పరిమళ. తల్లి రావడంతో మౌనంగా వుండిపోయింది.

"వేడినీళ్ళు తోడాను లే! వెళ్ళి స్నానం చేసిరా!" అంది భాగ్యలక్ష్మి.

అందరూ టేబిల్ చుట్టూ చేర్చుని భాగ్యలక్ష్మమ్మ వడ్డిస్తుంటే ఆమె చేతివంట మెచ్చుకుంటూ మాట్లాడకోసాగేరు.

"ఇంటికేమి మనియార్డరు పంపడం లేదు.... జీతం అంతా ఖర్చు పెట్టేస్తున్నావటరా?" —భాగ్యలక్ష్మమ్మ అడిగింది.

"ఇంటికెందుకమ్మా! మన యిల్లు సగం అద్దెకిచ్చారుగా. అద్దె వయిదొందలు, నాన్నగారి పెన్షన్, రెండెకరాలమీద పంటడబ్బు-ఇవి సరిపోవడంలేదా మీకు! ఓ పని చెయ్యండి! ఇల్లంతా అద్దెకిచ్చి మీ ముగ్గురూ నా దగ్గరకొచ్చెయ్యండి!" అనేవాడు తేలిగ్గా.

"డబ్బు సరిపోవడంలేదని గాదురా! నాన్నగారికి కొంత డబ్బు పంపిస్తే రేపు చెల్లెలు పెళ్ళిఖర్చుకు పనికొస్తుందిగదా!" —అంది భాగ్యలక్ష్మమ్మ.

"నాకేం పంపక్కర్లేదు గాని వాడిని సరదాగా ఖర్చు పెట్టుకోనీ! ఈ వయస్సులో ఖర్చుపెట్టకపోతే వాడింకెప్పుడు ఖర్చు పెడతాడు" —అనేసి పళ్ళెంలో చెయ్యి కడుక్కున్నాడు ఈశ్వరయ్య.

"అదేమిటండీ పెరుగన్నం తినకుండానే చెయ్యి కడుక్కున్నారు. మరో పళ్ళెం తెస్తా కూర్చోండి!"

"వద్దులేవే! ఆకలి లేదు...ఎక్కువగా తింటే అజీర్తి చేస్తుంది."

ముందుగదిలోకివొచ్చి పడక్కుర్చీలో కూర్చున్నాడు ఈశ్వరయ్య.

పైకి మనిషి గంభీరంగానే వున్నాడే గాని, మనస్సులో అలజడి ప్రారంభమైంది.

కొడుకును డబ్బు పంపొద్దన్నాడేగాని, మనస్సులో 'హాఁ మనియార్డర్ పంపితే ఎంత బావుణ్ణు!' అనుకున్నాడు.

ఆత్మీయులకు డబ్బు పంపడంలో ఆనందం వాడికేం తెలుసు? పెద్దన్నయ్య తన సౌఖ్యం చూసుకుంటే తానీస్థితిలో వుండేవాడా?

పెద్దన్నయ్యది ఎంత మంచి మనస్సు! తనవాళ్ళకోసం ఎంత ఆరాటపడేవాడు....

గతం తాలూకు జ్ఞాపకాలు సెలయేళ్ళ మోతలా మెదడులో వినిపించేయి, సినిమా రీళ్ళలా కన్పించేయి.

* * *

నాన్న వయస్సులో వున్నప్పుడు సకల కళాప్రియుడవ్వడంతో వున్న ఆస్తి అంతా హారతి కర్పూరంలా హరించుకుపోయింది. మూడెకరాల పొలం మిగిలింది చివరికి.

ఇంట్లో ఎనిమిదిమంది పిల్లలు. బాధ్యతలు తెలిసి ఖర్చులు తగ్గించేడు నాన్న.

పెద్దన్నయ్య వొక్కడే ఉద్యోగం చేస్తున్నది. సదరన్ రైల్వేస్‌లో బ్రిడ్జి ఇన్‌స్పెక్టరుగా పన్జేసేవాడు. కేరళలో ఎక్కువ సంవత్సరాలు పనిచేశాడు.

ప్రతినెలా ఆరో తారీఖుకల్లా మనియార్డరు వొచ్చేది.

ఆరో తారీఖు వచ్చిందంటే చాలు నాన్న బయటకు కదిలేవాడు కాదు. వరండాలోనే పోస్టుమాన్ వొచ్చేంతవరకు కూర్చునేవాడు. పోస్టుమాన్ రావడం ఆలస్యం అయితే గేటుదగ్గర కాలుగాలిన పిల్లిలా తిరిగేవాడు.

అమ్మ భోజనం వొడ్డించానన్నా యింట్లోకి వొచ్చేవాడు కాదు.

అన్నయ్య పంపిన రెండొందల్లో నో వంద కిరాణాకొట్లో జమచేసేవాడు. ఆ కొట్లో బాకీ పెరిగిపోతూనే వుండేది. గుడ్డలకొట్లో, కూరగాయల కొట్లో, అన్ని చోట్లా బాకీలే!

పంటలు బాగా పండిన సంవత్సరం అప్పులు తీరేవి. మళ్ళీ అతివృష్టి, అనావృష్టి కాలాల్లో పంటలు దెబ్బ. అన్నప్పుడు షరా మామూలే! అప్పులు పెరిగిపోయేవి.

తన ఖర్చులకని పదిరూపాయిలుంచుకుని మిగిలిన తొంభై అమ్మకి యింట్లో ఖర్చులకని యిచ్చేవాడు.

ఇంట్లో మగపిల్లలందరికీ బాకీబట్టలే కొనేవారు. మురికయినా కనబడదని, ఎక్కువరోజులు వొస్తాయని.

....స్కూల్లో "పోలీసోడు! పోలీసోడు." అనేవాళ్ళు తన బట్టలు చూసి. చివుక్కుమనేది మనస్సు....

నాన్న చనిపోయేవరకూ అన్నయ్య డబ్బు పంపుతూనే వుండేవాడు. పదకొండేళ్ళు క్రమం తప్పకుండా డబ్బు పంపించడమంటే గొప్ప విషయమే!

కూతుళ్ళ పెళ్ళిడుకు రావడంతో నాన్న చనిపొయ్యాక డబ్బు పంపడం ఆపేశాడు. అప్పుడే రెండో అన్నయ్యకు ఉద్యోగం వొచ్చింది.

వదిన పోరు పడలేక రెండేళ్ళు డబ్బు పంపి మానేశాడు రెండో అన్నయ్య.


చెల్లెలు పెళ్ళి, తన చదువు పూర్తయ్యే సరికి వొక్క ఎకరం పొలం మాత్రమే మిగిలింది. ఇంకా యిద్దరు తమ్ముళ్ళు చిన్న తరగతుల్లోనే వుండిపోయేరు.

హైస్కూల్లో టీచరుగా సెటిలయ్యాడు తను.

ప్రతినెల అమ్మకు డబ్బు పంపించేవాడు తను. మనిఆర్డర్ అందటం ఆలస్యమయితే తమ్ముళ్ళు ఉత్తరంమీద ఉత్తరం రాసేవారు.

వాళ్ళెక్కడ యిబ్బంది పడతారేమోనని వొక్కోసారి టి.యమ్.వో ద్వారా పంపేవాడు.

మనియార్డరు రాకపోతే ఇంట్లో వాళ్ళు పడే యిబ్బంది తనకి తెలుసు. ఖర్చులన్నీ




తగ్గించుకుని సాధ్యమైనంతవరకూ ఎక్కువగా డబ్బు ఇంటికి పంపేవాడు.

తమ్ముళ్ళు ఎదిగొచ్చి, ఉద్యోగాలు సంపాదించుకున్నాక ఇంటి భారం తగ్గింది.

కానీ మనియార్డర్లు పంపడం ఆగిపోలేదు. రెండో అక్కయ్య కొడుక్కి పంపాల్సి వచ్చింది. శ్రీనివాస్‌కి ఇంజినీరింగ్ సీటు వచ్చింది. వాళ్ళ ఆర్థిక పరిస్థితులు సరిగ్గా లేకపోవడంతో ఐదేళ్ళు వాడికి డబ్బు పంపేడు.

శ్రీనివాస్ ఇంజినీరింగ్ పూర్తిచేశాడు.

వాడి చదువు పూర్తవగానే అక్కయ్య కళ్ళలో మెరిసిన ఆనందం చూశాడు.... అదే తనకి తృప్తి.

తనదగ్గరవున్న డబ్బుతో తోటివారికి సాయపడినప్పుడు కలిగే ఆనందం, మేడలు, మిద్దెలు కట్టించడంవల్ల కలిగే ఆనందం కంటే గొప్పది.

....తను డబ్బు సంపాదించినన్నాళ్లూ మనియార్డర్లు చేస్తూనే వున్నాడు .... ఇప్పుడిక సంపాదన లేదు....

డబ్బు పంపాల్సినవాళ్లు లేరు....

డబ్బు తనకి పంపించేవాళ్లు లేరు....

చిన్నప్పటినుండి మనియార్డరుతో ఏదో అనుబంధం.

తనెవరికైన డబ్బు పంపితే బావుణ్ణు!

ఎవరైనా తనకి డబ్బు పంపితే బావుణ్ణు!

ఏదో విధంగా మనియార్డరు ఫారం తన చేతిలో వుండాలి!

"డబ్బు పంపరా!" అని ఎలా కొడుకుని అడగటం. వాడొకవేళ అలా అడిగి డబ్బు తెప్పించుకుంటే మళ్ళీ అసంతృప్తే!

* * *

"నాన్నా! నీకు మనియార్డరొచ్చింది!" పరిమళ కేకేసింది. ఈశ్వరయ్య హడావుడిగా ఇంట్లోనుంచి బయటకొచ్చాడు. వూడిపోతున్న పంచెను పైకి ఎగదోపుకుంటూ.

పోస్ట్‌మాన్‌కేసి ఎగాదిగా చూశాడు 'మనియార్డరు తనకేనా?' అన్న అనుమానంతో.

ఆ ఆశ్చర్యావస్థనుండి తేరుకోవడానికి రెండు నిముషాలు పట్టింది.

మనియార్డరు ఫారంపైని అడ్రస్ చూసి స్థిమితపడ్డాడు.

పోస్ట్‌మాన్ దగ్గరనుండి డబ్బందుకుంటున్నప్పుడు అనిర్వచనీయమైన అనుభూతితో ఊగిపోయాడు మనిషి.

మనియార్డరుతోపాటు వో ఉత్తరం కూడ ఇచ్చివెళ్ళాడు పోస్ట్‌మాన్.

కళ్ళజోడు సరిచేసుకుంటూ ఉత్తరం కేసి చూశాడు.

ముత్యాల్లా అక్షరాలు బారులు తీసి వున్నాయి.

"పూజ్యనీయులైన రామయ్యగారికి,

నమస్సులు-

అందరూ క్షేమమని తలుస్తాను.

అమ్మ కులాసాగానే వుంది.

సిమెంట్ ఫ్యాక్టరీలో 'వర్క్స్ మేనేజర్'గా ఉద్యోగం వొచ్చింది. నెలకు మూడువేలు జీతం. పెద్ద క్వార్టరు, కారు కూడ ఇచ్చేరు.

నే నీస్థితిలో వుండటానికి మీరే కారణం. అంతా మీ చేతిచలువ.

మీరు పంపిన డబ్బుకు ఇలా పంపడం చెల్లుకాదు. మీకు డబ్బుకొరత అనికూడ కాదు.... నెల, నెలా డబ్బు పంపుతాను. దయచేసి మీరు కాదనకూడదు... మీకు ఈ డబ్బు అవసరం లేకపోతే ఏ పేదవాడికో దానం చెయ్యండి. అది మీ చేతుల మీదుగా జరిగితే నాకు తృప్తి.

త్వరలో అమ్మను తీసుకుని మీ ఆశీస్సులకోసం వొస్తాను.

పరిమళను అడిగినట్లు చెప్పండి.

ఇట్లు
మీ శిష్యుడు
శ్రీనివాస్

తన భుజంపైనుంచి ఆసక్తిగా ఉత్తరం చదువుతున్న కూతుర్ని చూశాడు ఈశ్వరయ్య.

"ఉత్తరంలోని ఆఖరివాక్యం చదువుకో తల్లీ!"

తండ్రి చేతిలోని ఉత్తరం లాక్కొని లేడిపిల్లలా ఇంట్లోకి పరుగెత్తింది పరిమళ.

—o—